సాక్షి

శ్రీసత్యసాయి జిల్లా

శనివారం । 11 । అక్టోబర్ । 2025



చీనీ టన్ను రూ.15 వేలు

అనంతపురం మార్కెట్‌యార్డులో శుక్రవారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.15 వేలు, కనిష్టంగా రూ.8 వేల ప్రకారం ధర పలికాయి.



తెగిన హంద్రీ–నీవా కాలువ

మడకశిర రూరల్: కేతేపల్లి, నల్లనాయకపల్లి గ్రామల మధ్య శుక్రవారం హంద్రీ–నీవా కాలువ గట్టు తెగింది. పరిగి చెరువుకు నీరు వెళ్తుండటంతో మరమ్మతు పనులు చేయలేకపోయారు.

గరిష్టం/కనిష్టం

34.1°/20.6°

జిల్లాలో శుక్రవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా జడితో కూడిన వర్షం కురిసింది. గంటకు 8 నుంచి 14 కి.మీ వేగంతో నైరుతి దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

ఇసుక అక్రమ రవాణాపై ఆర్డీఓ కొరడా

- టిప్పర్, రెండు ట్రాక్టర్లు సీజ్, కేసు నమోదు



పోలీసులు స్వాధీనం చేసుకున్న టిప్పర్, ట్రాక్టర్లు

సాక్షి ఎఫెక్ట్..

బత్తలపల్లి: మండలంలోని చిత్రావతి నది పరివాహక గ్రామాల నుంచి ఇసుక అక్రమ రవాణాపై ఆర్డీఓ మహేష్ ప్రత్యేక దృష్టి సారించారు. ఈ నెల 5వ తేదీన 'చిత్రావతిపై పచ్చ పడగ' శీర్షికన 'సాక్షి'లో కథనం ప్రచురితం కావడంతో ఆయన స్పందించారు. పోలీసులు, రెవెన్యూ, మైనింగ్ అధికారులతో చర్చించారు. ఈ క్రమంలోనే గురువారం రాత్రి ధర్మవరం ఆర్డీఓ మహేష్, బత్తలపల్లి రెవెన్యూ సిబ్బంది, బత్తలపల్లి ఎస్‌ఐ సోమశేఖర్, పోలీస్ సిబ్బందితో కలిసి ఇసుక అక్రమ రవాణాపై దాడులు చేశారు. ఇసుక తరలించేందుకు సిద్ధంగా ఉన్న ఒక టిప్పర్, రెండు ట్రాక్టర్లను స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశారు.

నారాయణ పాఠశాలకు షోకాజ్ నోటీస్

హిందూపురం టౌన్: పట్టణంలోని నారాయణ పాఠశాలకు శుక్రవారం మండల విద్యాశాఖ అధికారి గంగప్ప షోకాజ్ నోటీసు జారీ చేశారు. ఇటీవల నారాయణ పాఠశాల యాజమాన్యం నిబంధనలకు విరుద్ధంగా స్కాలర్ షిప్ పేరిట ఎంట్రెన్స్ టెస్ట్ నిర్వహించడంతో పాటు ప్రచారం నిమిత్తం పిల్లలను ఇంటికి పంపుతోందని విద్యార్థి సంఘం నాయకులు అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో శుక్రవారం ఎంఈఓ గంగప్ప నోటీస్ ఇచ్చారు. మూడురోజుల్లోపు వివరణ ఇవ్వాలని పేర్కొన్నారు.

ఊరూరా కల్తీ కిక్కు!

కల్తీ మద్యం ధర్మవరాన్ని కబళిస్తోంది. క్వార్టర్ తాగితే చాలు మందుబాబులు కళ్లు తేలేసి పడిపోతున్నారు. పిచ్చిపట్టినట్లుగా ప్రవర్తిస్తూ స్పృహ కోల్పోతున్నారు. కొందరైతే ప్రాణాలే పోగొట్టుకున్నారు. బాధితుల్లో నిరుపేదలు, మధ్య తరగతి వారే అధికంగా ఉండటంతో ఆయా కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి. అయినా ఈ కల్తీ మద్యం మహమ్మారిని అరికట్టే వారే లేకుండా పోయారు.

క్వార్టర్ రూ.40 లోపే

ఒక బ్రాండ్ మద్యం క్వార్టర్ బాటిల్ బహిరంగ మార్కెట్‌లో రూ.200 ఉంటే, అచ్చు దాన్ని పోలినట్లే ఉండే కల్తీ మద్యం కేవలం రూ.40కే మద్యం షాపు యజమానులకు అందుతోంది. దీంతో లాభం బాగా వస్తుండటంతో సదరు మద్యం షాపు యజమానులు ఇష్టారాజ్యంగా.. బెల్ట్‌షాపులకు, ధాబాలు, చిన్నపాటి హోటళ్లకు ఎంఆర్‌పీ కంటే తక్కువకే సరఫరా చేస్తున్నట్లుగా తెలుస్తోంది. ఇటీవల రాష్ట్రంలోని పలు ప్రాంతాలలో కల్తీ మద్యం తయారీ కేంద్రాలు బయటపడటం ఈ ఆరోపణలకు బలం చేకూరుతోంది.

'మాది మాకిస్తే... మీరు ఏమైనా చేసుకోవచ్చు. కల్తీ మద్యం విక్రయించుకున్నా మాకు అభ్యంతరం లేదు. విజయవాడ నుంచి ఎప్పుడైనా స్క్వాడ్ వస్తే వారికీ అంతో ఇంతో ఇవ్వండి. మీకు ఎలాంటి ఇబ్బందీ ఉండదు''

– ధర్మవరంలోని మద్యం షాపుల నిర్వాహకులతో ఓ ఎక్సైజ్ అధికారి చెప్పిన మాటలివి.



- ధర్మవరంలో ఏరులై పారుతున్న కల్తీ మద్యం
- కూటమి పార్టీల నాయకుల అండతో యథేచ్ఛగా దందా
- స్పిరిట్‌కు రంగునీళ్లు కలిపి విక్రయిస్తున్న వైనం
- కల్తీ మద్యం తాగి పిచ్చిపట్టినట్లు ప్రవర్తిస్తున్న మందుబాబులు
- రోగాల బారిన పడి ప్రాణాలు కోల్పోతున్న వైనం
- రోడ్డున పడుతున్న బాధిత కుటుంబాలు
- మామూళ్ల మత్తులో జోగుతున్న ఎక్సైజ్ పోలీసులు



డీఎస్పీ కార్యాలయం ఎదుట పడిపోయిన మందుబాబు



కొత్తపేటలో రోడ్డు ప్రక్కన అపస్మారక స్థితిలో మందుబాబు



ఎల్‌పీ సర్కిల్ వద్ద మద్యం మత్తులో అచేతనంగా యువకుడు



గాంధీ జయంతి రోజున బత్తలపల్లి రోడ్డు పక్కన పడి ఉన్న యువకుడు

ధర్మవరం: కల్తీ మద్యం పేద, మధ్య తరగతి కుటుంబాలను రోడ్డున పడేస్తోంది. రోజంతా పని చేసి రిలాక్స్ కోసమో.. వ్యసనానికి అలవాటు పడో మందుబాబులు... వైన్‌షాపులు, బెల్ట్‌షాపుల వద్ద మద్యం కొనుగోలు చేసి తాగుతున్నారు. ఆ తర్వాత పిచ్చిపిచ్చిగా ప్రవర్తిస్తూ... అరుస్తూ.. రోడ్లపైనే అచేతనంగా పడిపోతున్నారు. కొందరు ఆ తర్వాత కోలుకున్నా రోగాలతో బాధపడుతున్నారు. మరి కొందరు ప్రాణాలే కోల్పోతున్నారు. అయినా ఆ చావులేవీ లెక్కల్లోకి రాకుండా 'కల్తీ మద్యం దందా ముఠా' మ్యానేజ్ చేస్తున్నట్లు తెలుస్తోంది.

పల్లెపల్లెనా బెల్టుషాపులు..

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ధర్మవరం నియోజకవర్గంలో బెల్ట్‌షాపులు ఇబ్బడి ముబ్బడిగా వెలిశాయి. ధర్మవరం పట్టణంలోనే 20 దాకా బెల్ట్‌షాపులు ఏర్పాటయ్యాయి. ఇక ధర్మవరం రూరల్ మండలంలో 13, తాడిమర్రి మండలంలో 15, ముదిగుబ్బలో 100, బత్తలపల్లిలో 40 దాకా బెల్ట్‌షాపులు ఏర్పాటయ్యాయి. ఇవన్నీ కూటమి పార్టీల నాయకుల ఆధ్వర్యంలోనే నడుస్తున్నాయి. ఇవికాక ధర్మవరం నియోజకవర్గ వ్యాప్తంగా కూటమి పార్టీలు, తటస్తులకు సంబంధించి 20 దాకా మద్యం దుకాణాలున్నాయి. ఈ దుకాణాలకు సమీపంలోనే బార్‌ను తలపించే విధంగా ఒక దుకాణాన్ని ఏర్పాటు చేసి పర్మిట్ రూం తరహాలో బాహాటంగానే మద్యం తాగిస్తున్నారు.

యథేచ్ఛగా కల్తీ మద్యం విక్రయాలు..?

మద్యం దుకాణాలను రూ.లక్షలు పోసి దక్కించుకున్న కూటమి పార్టీల నాయకులకు అంతగా ఆదాయం రావడం లేదు. మరోవైపు అమ్మకాలపై 20 శాతం ఇస్తామన్న కమీషన్ తగ్గించారు. దీంతో మద్యం షాపు యజమానులు ఆదాయం కోసం ప్రత్యామ్నాయ మార్గాలపై దృష్టిసారించారు. ఈక్రమంలోనే మద్యాన్ని కల్తీ చేసి లాభాలు గడిస్తున్నారు. మదనపల్లి, చిత్తూరు, పావగడ సరిహద్దు ప్రాంతాల్లో అధికార పార్టీల నాయకులు ఏకంగా ఫ్యాక్టరీలే పెట్టి కల్తీ మద్యాన్ని తయారు చేసి ఉమ్మడి అనంతపురం జిల్లాలకు సరఫరా చేస్తున్నట్లుగా సమాచారం. ఇందులో ఎక్కువగా ధర్మవరం నియోజకవర్గానికే సరఫరా అవుతున్నట్లు తెలుస్తోంది. ఎక్కువగా అమ్ముడయ్యే బ్రాండ్‌లను పోలి ఉండేలా స్పిరిట్, ఫ్లేవర్‌లతో పాటు ఇతర రసాయనాలను కలిపి అచ్చం ఒరిజినల్ ప్యాకింగ్, సీల్‌లతో పాటు హోలోగ్రాంలు వేసి ప్రతికేస్‌లో సగానికిపైగా పెట్టి విక్రయిస్తున్నట్లుగా సమాచారం.

తాగితే పడిపోవాల్సిందే..

ధర్మవరం ప్రధాన కూడళ్లలో మందుబాబులు అచేతనంగా పడిపోయి కనిపిస్తున్నారు. ఇటీవల ఏకంగా ధర్మవరం డీఎస్పీ కార్యాలయం ప్రధాన గేటు వద్ద మందుబాబు మద్యం సేవించి పడిపోయాడు. దీంతో అతడిపై ఎన్ని నీళ్లు పోసినా అతని స్పృహ రాలేదు. దీంతో పలువురు కానిస్టేబుళ్లు అతడిని బైక్‌పై మరో ప్రాంతానికి తీసుకువెళ్లి దిగబెట్టి వచ్చారు. కల్తీ మద్యం తాగడం వల్లే అతను అలా పడిపోయాడని స్థానికులు చర్చించుకున్నారు.

శ్రమజీవులు, నిరుపేదలే అధికం..

ధర్మవరంలో ఎక్కువ శాతం రోజువారి కూలీలు, చేనేత కార్మికులే ఉన్నారు. వీరు రోజంతా కష్టపడి సాయంత్రం వేళ మద్యం సేవిస్తే అది కాస్తా కల్తీమయం కావడంతో అనారోగ్యం పాలవుతున్నారు. పట్టణంలోని కొత్తపేట, ఎల్‌సీకేపురం, తారకరామాపురం, గుట్టకిందపల్లి, శివానగర్, శాంతినగర్ తదితర శివారు ప్రాంతాల్లో చాలామంది మద్యం సేవించి గుండెపోటుకు గురి కావడం, బ్రెయిన్ స్ట్రోక్‌కు గురై మంచాన పడటం సర్వసాధారణంగా మారింది.

చర్యలు శూన్యం..

ధర్మవరానికి సరఫరా అవుతున్న కల్తీ మద్యం గురించి ఎక్సైజ్ అధికారులకు తెలిసినా పట్టించుకోవడం లేదు. నాలుగు నెలల క్రితం ఎక్సైజ్ ఉన్నతాధికారి ఒకరు ధర్మవరంలోని వైన్‌షాప్ నిర్వాహకులతో రహస్యంగా సమావేశమై మామూళ్ల గురించి చర్చించినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఒక్కో వైన్‌షాపు నుంచి నెలకు రూ.లక్ష మేర ఎక్సైజ్ శాఖకు వెళ్తున్నట్లు సమాచారం. అలానే ధాబా నిర్వాహకులు రూ.20 వేలు, బెల్ట్‌షాపు నిర్వాహకులు ప్రాంతాన్ని బట్టి రూ.5 వేల నుంచి రూ.10 వేల మేర ఎక్సైజ్ కార్యాలయానికి ముట్టజెబుతున్నట్లుగా తెలుస్తోంది.

సరిహద్దులోనే 'కల్తీ' తయారీ

- బైక్‌లపై ధాబా, హోటళ్లు, బెల్ట్‌షాపులకు డెలివరీ



బైక్‌పై కల్తీ మద్యం సరఫరా చేస్తున్న దృశ్యం

సోమందేపల్లి: కల్తీ మద్యం హిందూపురం, పరిగి మండలాల పరిధిలో తయారవుతున్నట్లు తెలుస్తోంది. అక్కడే కల్తీ మద్యం తయారు చేసి లేబుళ్లు అతికించి సోమందేపల్లి, గోరంట్ల, పరిగి, పెనుకొండ మండలాలకు సరఫరా చేస్తున్నట్లు సమాచారం. అనుమానం రాకుండా సరుకుల తరహాలో ప్యాకింగ్ చేసి బైక్‌లపై హోటళ్లు, ధాబాలు, బెల్ట్‌షాపులకు డెలివరీ చేస్తున్నారు. ఓ బ్రాండ్ మద్యం 48 బాటిళ్ల ధర రూ.4,800 ఉంటే... తాము రూ.3 వేలకే ఇస్తామని బేరసారాలు చేస్తూ వ్యాపారాన్ని విస్తరిస్తున్నారు. దీంతో లాభం బాగా వస్తుందన్న ఆశతో బెల్టుషాపులు, కొన్ని మద్యం దుకాణాల నిర్వాహకులు కల్తీకి ఓటు వేస్తున్నారు. కూలీలు, కార్మికుల జీవితాలతో ఆడుకుంటున్నారు. కూటమి పార్టీల నాయకులు, అధికారుల హస్తం ఉండడంతో కల్తీ మద్యం దందా జరుగుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. కట్టడి చేయాల్సిన ఎక్సైజ్ శాఖ అధికారులే మామూళ్ల మత్తులో మునిగినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

జగన్‌తోనే అణగారిన వర్గాలకు ప్రాధాన్యం



సమావేశానికి హాజరైన వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు



మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు సుధాకర్ బాబు, చిత్రంలో పార్టీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీ చరణ్, పార్లమెంట్ పరిశీలకుడు రమేష్‌రెడ్డి, సమన్వయకర్తలు టీఎన్ దీపిక, ఈరలక్కప్ప, పార్టీ నేత మధుమతిరెడ్డి తదితరులు

- వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు సుధాకర్ బాబు
- హిందూపురంలో వైఎస్సార్ సీపీ జిల్లా స్థాయి సమావేశం

చిలమత్తూరు: వైఎస్ జగన్‌తోనే అణగారిన వర్గాలకు అధికారం సాధ్యమని వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు సుధాకర్ బాబు అన్నారు. శుక్రవారం హిందూపురంలోని సాయిరాం ఫంక్షన్ హాలులో వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు నరసింహమూర్తి అధ్యక్షతన జిల్లా విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన సుధాకర్ బాబు మాట్లాడుతూ..ఎన్నికలు ఎప్పుడు జరిగినా వైఎస్ జగన్ సీఎం కావడం ఖాయమన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎస్సీలు, ఎస్టీలకు మంత్రి పదవులిచ్చి తన పక్కన కూర్చోబెట్టుకున్నారన్నారు. అలాగే పంచాయతీ సర్పంచ్ నుంచి జెడ్పీ చైర్మన్ వరకూ పదవులిచ్చి అధికారంలో భాగం చేశారన్నారు. కానీ నేడు రాష్ట్రంలో ఉన్న కూటమి ప్రభుత్వం దళితులను రాజకీయంగా, సామాజికంగా, ఆర్థికంగా అణగదొక్కుతోందన్నారు. ఇక డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ప్రాతినిథ్యం వహిస్తున్న పిఠాపురంలో దళితులను గ్రామాలను నుంచి వెలి వేశారన్నారు. ఇలాంటి ఘటనలు కేవలం టీడీపీ అధికారంలో ఉన్నప్పుడే ఎందుకు జరుగుతున్నాయో అందరూ ఆలోచించాలన్నారు. దళిత వ్యతిరేక కూటమి సర్కార్‌ను కూల్చేందుకు సిద్ధంగా ఉండాలన్నారు.

జగన్‌ను మళ్లీ సీఎంగా చేసుకుందాం

రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు చేస్తున్న కూటమి సర్కార్...ఎస్సీ, ఎస్టీలపై దాడులను ప్రోత్సహిస్తోందని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీ చరణ్ అన్నారు. అందుకే నేడు రాష్ట్రంలో దళితులకు రక్షణ లేకుండా పోయిందన్నారు. చివరకు దళిత సర్పంచ్‌కు కనీస గౌరవం ఇవ్వడం లేదన్నారు. పెనుకొండలో మంత్రి సవిత 15 ఫైనాన్స్ నిధులను దళిత సర్పంచ్‌లకు ఇవ్వకుండా అడ్డుకున్నారని మండిపడ్డారు. దళితులకు అన్యాయం చేస్తున్న కూటమి ప్రభుత్వాన్ని గద్దెదించి అందరినీ సమానంగా చూసే వైఎస్ జగన్‌ను మళ్లీ సీఎంగా చేసుకుందామని పిలుపునిచ్చారు. హిందూపురం పార్లమెంట్ పరిశీలకుడు రమేష్‌రెడ్డి మాట్లాడుతూ... కూటమి ప్రభుత్వంలో దళితుల పట్ల అమానుషంగా ప్రవర్తిస్తున్నారని, రెడ్‌బుక్‌లో అణగారిన వర్గాలనే ఎక్కువగా లక్ష్యంగా చేసుకున్నారన్నారు. బుద్ధిహీనుడైన లోకేష్ చేతిలో రాష్ట్ర ప్రజలు నలిగిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అందరం కలిసి కట్టుగా టీడీపీకి గట్టి బుద్ధి చెబుదామని పిలుపునిచ్చారు. హిందూపురం నియోజకవర్గ సమన్వయకర్త టీఎస్ దీపిక మాట్లాడుతూ.. అణగారిన వర్గాలను అక్కున చేర్చుకున్న ఏకైక పార్టీ వైఎస్సార్ సీపీ మాత్రమేనన్నారు. మాజీ సీఎం ఎప్పుడూ నా ఎస్సీ, నా ఎస్టీ, నా బీసీ అంటూ ఆప్యాయంగా మాట్లాడే వారన్నారు. సమానత్వాన్ని పెంపొందించిన ఏకైక నేత వైఎస్ జగన్ అని అన్నారు. టీడీపీ నేతలు అంబేద్కర్ విగ్రహాన్ని తగులబెట్టడాన్ని చూస్తే దళితులంటే వారికి ఎంత చిన్నచూపో అర్థం చేసుకోవచ్చన్నారు.

దళితుల ఆత్మగౌరవ పతాక జగన్..

మడకశిర నియోజకవర్గ సమన్వయకర్త ఈరలక్కప్ప మాట్లాడుతూ.. వైఎస్ జగన్ తన హయాంలో అమరావతిలో ఆకాశమంత ఎత్తులో అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేసి ప్రపంచమంతా రాష్ట్రం వైపు చూసేలా చేశారన్నారు. దళితులను అధికారంలో భాగం చేసి వారి అభ్యున్నతిపై తనకున్న చిత్తశుద్ధిని చాటుకున్నారన్నారు. జగన్ దళితుల ఆత్మగౌరవ పతాకగా నిలిచారన్నారు. అందుకే మనల్ని ప్రేమించే నాయకుడు వైఎస్ జగన్ ఒక్కరే అని.. ఆయన్ను మళ్లీ సీఎం చేసుకొని దళితుల ఆత్మగౌరవాన్ని కాపాడుకుందామని పిలుపునిచ్చారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కనకారావు, పార్టీ మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చౌళూరు మధుమతిరెడ్డి, హిందూపురం నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు సూర్యమోహన్, ఎంపీపీ రత్నమ్మ, నాయకులు చిన్నప్పయ్య, శ్రీరాములు, చందు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

దివ్యాంగులకు పింఛన్ కష్టాలు

- జిల్లాలో ప్రారంభమైన పునః పరిశీలన
- 5,204 మందిని పరీక్షించనున్న వైద్యులు
- సుదూర ప్రాంతాల్లోని ఆస్పత్రులకు కేటాయించడంతో ఇబ్బందులు



హిందూపురం ఆసుపత్రికి వచ్చిన లబ్ధిదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ శ్యాం ప్రసాద్

పుట్టపర్తి అర్బన్: కూటమి ప్రభుత్వ అవగాహనారాహిత్యం దివ్యాంగులకు తీరని కష్టాలు పెట్టింది. సదరం సర్టిఫికెట్ ఆధారంగా ఏళ్లుగా పింఛన్ పొందుతున్న దివ్యాంగులు మరోసారి పరీక్షించాలంటూ కూటమి సర్కార్ మూడు నెలల క్రితం శిబిరాలు నిర్వహించింది. అయితే వైద్యులు కనీసం పరీక్షించకుండానే ఇష్టానుసారం వైకల్య శాతం నమోదు చేశారు. ఇలా 40 శాతంలోపు వైకల్యం ఉన్నట్లు సర్టిఫికెట్ వచ్చినా చాలా మంది రీ అసెస్‌మెంట్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. వారందరికీ తాజాగా పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఈ ప్రక్రియ కదిరి, మడకశిర, ధర్మవరం, హిందూపురం ఆసుపత్రుల్లో శుక్రవారం మొదలైంది. అయితే అధికారులు సుదూర ప్రాంతాల్లోని ఆస్పత్రులకు రెఫర్ చేయడంతో దివ్యాంగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నడవలేని స్థితిలో ఉన్న వారు వ్యయ ప్రయాసల కోర్చి రూ. వేలు ఖర్చు చేసుకుని పరీక్షలకు వెళ్తున్నారు.

రోజుకు 30 మందికే..

జిల్లాలో 5,204 మంది రీవెరిఫికేషన్‌కు దరఖాస్తు చేసుకున్నారు. వారికి శుక్రవారం నుంచి మడకశిర, ధర్మవరం, కదిరి ఏరియా ఆస్పత్రులతో పాటు హిందూపురం జిల్లా ఆసుపత్రిలో పరీక్షలు నిర్వహిస్తున్నారు. హిందూపురంలో కలెక్టర్ శ్యాంప్రసాద్ రీవెరిఫికేషన్ ప్రక్రియను పరిశీలించారు. ప్రస్తుతం ఒక్కో ఆస్పత్రిలో రోజుకు 30 మంది మాత్రమే పరీక్షిస్తారు. దీంతో దరఖాస్తు చేసుకున్న వారందరినీ పరీక్షించాలంటే సుమారు 3 నెలల సమయం పడుతుందని డీఆర్‌డీఏ అధికారులు చెబుతున్నారు. లబ్ధిదారులు పరీక్షలు పూర్తయి వైకల్య శాతం సర్టిఫికెట్ వచ్చే వరకూ పెన్షన్ అందిస్తామంటున్నారు.

క్లుప్తంగా

జిల్లాలో సెంట్రల్ వర్సిటీ ఏర్పాటు చేయండి



కలెక్టర్‌కు వినతి పత్రం ఇస్తున్న ఏపీ ఎస్టీ కమిషన్ మాజీ సభ్యుడు వడిత్యా శంకర నాయక్

పుట్టపర్తి అర్బన్: జిల్లాలో కేంద్రీయ విశ్వవిద్యాలయం, గిరిజన పిల్లలకు నాణ్యమైన విద్యను అందించే ఏకలవ్య మోడల్ రెసిడెన్సియల్ స్కూల్ ఏర్పాటయ్యేలా చూడాలని కలెక్టర్ శ్యాం ప్రసాద్‌కు ఏపీ ఎస్టీ కమిషన్ మాజీ సభ్యుడు వడిత్యా శంకర నాయక్ విన్నవించారు. ఈ మేరకు శుక్రవారం కలెక్టర్‌ను ఆయన చాంబర్‌లో కలసి వినతి పత్రం అందజేసి, మాట్లాడారు. జిల్లాలోని పలు గిరిజన గ్రామాల్లో మౌలిక వసతులు లేక అభివృద్ధికి నోచుకోవడం లేదన్నారు. ఎస్టీ సబ్ ప్లాన్ కింద గిరిజనులకు కేటాయించిన బడ్జెట్ మొత్తాన్ని గిరిజన ప్రాంత అభివృద్ధికే ఖర్చు పెట్టాలని కోరారు. గిరిజనుల్లోకి ఇతర కులాలను చేర్చే ప్రతిపాదనను ప్రభుత్వం తక్షణమే విరమించుకోవాలన్నారు. గిరిజన నిరుద్యోగ యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు జిల్లాలో పరిశ్రమలు, స్మాల్ స్కేల్ యూనిట్లు ఏర్పాటు చేయాలన్నారు. ఈ సందర్భంగా ఆయన వెంట ఎల్‌ఐసీ నారాయణ నాయక్, ఆనంద్‌నాయక్, గోపాల్‌నాయక్, అంజీ నాయక్, సురేంద్ర నాయక్, చిన్న అంజీ నాయక్, శశిధర్ నాయక్, హనుమంతు నాయక్ తదితరులు ఉన్నారు.

గ్రామాల్లో ప్రత్యేక నిఘా ఉంచాలి : ఎస్పీ



సచివాలయ మహిళా పోలీసులతో మాట్లాడుతున్న ఎస్పీ సతీష్‌కుమార్

గాండ్లపెంట: గ్రామాల్లో ప్రత్యేక నిఘా ఉంచాలని సిబ్బందికి ఎస్పీ సతీష్‌కుమార్ సూచించారు. స్థానిక పీఎస్‌ను వార్షిక తనిఖీలో భాగంగా శుక్రవారం ఎస్పీ పరిశీలించారు. రికార్డులు, ఎన్‌డీపీఎస్ కేసుల నిర్వహణను పరిశీలించారు. అనంతరం సిబ్బందితో మాట్లాడుతూ.. గ్రామాల్లో అక్రమ మద్యం, పేకాట, గుట్కా, క్రికెట్ బెట్టింగ్ తదితర చట్ట వ్యతిరేక కార్యకలాపాల నియంత్రణకు గట్టిగా కృషి చేయాలన్నారు. అనంతరం గ్రామ సచివాలయాల్లో పనిచేస్తున్న మహిళా పోలీసులతో సమావేశమై పలు అంశాలను ఆరా తీశారు. కదిరి డీఎస్పీ శివనారాయణస్వామి, రూరల్ సీఐ నాగేంద్ర, ఏఎస్ఐ వెంకట్రాముడు పాల్గొన్నారు.

నల్లచెరువు: స్థానిక పీఎస్‌ను శుక్రవారం ఎస్పీ సతీస్‌కుమార్ తనిఖీ చేశారు. ఆయన వెంట డీఎస్పీ శివనారాయణస్వామి, సీఐ నాగేంద్ర ఉన్నారు. రికార్డులను పరిశీలించారు. పెండింగ్ కేసుల వివరాలను ఎస్ఐ మక్బూల్ బాషాతో ఆరా తీశారు.

చీనీ మనుగడ ప్రశ్నార్థకం

చీనీ సాగుకు ఉమ్మడి అనంతపురం జిల్లా ప్రసిద్ధి. ఇక్కడి నేలల్లో పండే చీనీ రుచికరంగా ఉంటుందని పేరు. దేశంలోనే అత్యధిక విస్తీర్ణంలో ఇక్కడే సాగవుతోంది. ఇక్కడి నుంచి ఉత్తరాది రాష్ట్రాలకు ఎగుమతి అవుతోంది. అలాంటి చీనీ తోటల మనుగడ ప్రశ్నార్థకంగా మారింది. రైతులు అవలంబిస్తున్న సాగు పద్ధతులే ఇందుకు కారణం. ఇదే విషయాన్ని ఉద్యానశాఖ అధ్యయన బృందం తేల్చి చెప్పింది.

- గడ్డిమందు పిచికారీ వల్ల తగ్గుతున్న జీవితకాలం
- తెగుళ్లు, చీడపీడల వ్యాప్తితో దిగుబడిపై ప్రభావం
- పెరిగిన పెట్టుబడులతో రైతులకు దక్కని లాభం
- ఉద్యానశాఖ అధ్యయనంలో బహిర్గతం
- ఉమ్మడి జిల్లాలో 52 వేల హెక్టార్లలో చీనీతోటలు



అనంతపురం అగ్రికల్చర్: జిల్లాలో చీనీ తోటల స్థితిగతులపై ఉద్యానశాఖ కమిషనరేట్ జేడీ డాక్టర్ దేవమునిరెడ్డి, తిరుపతి చీనీ, నిమ్మ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ శ్రీనివాసరెడ్డితో కూడిన బృందం ఈ నెల 7, 8, 9 తేదీల్లో అధ్యయనం చేసింది. అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల ఉద్యానశాఖ డీడీలు ఉమాదేవి, చంద్రశేఖర్, ఇతర క్షేత్రస్థాయి అధికారులతో కలిసి గార్లదిన్నె, నార్పల, కూడేరు, శింగనమల, రాప్తాడు, పుట్లూరు, యల్లనూరు, తాడిమర్రి, బత్తలపల్లి తదితర మండలాల్లో సాగు చేసిన చీనీతోటలను పరిశీలించి రైతుల అనుభవాలు తెలుసుకున్నారు. ప్రధానంగా మొక్కల ఎంపిక, పంటకాలంలో ఆచరిస్తున్న సాగు పద్ధతులు, చీడపీడల నివారణకు చేస్తున్న సస్యరక్షణ చర్యలు, నీటి నిర్వహణ, పంటకాలాలు, సీజన్ల వారీగా పంట కోతలు, మార్కెటింగ్, గిట్టుబాటు ధరలు తదితర అన్ని అంశాలపై లోతుగా అధ్యయనం చేశారు. మూడు రోజుల అధ్యయనంలో అనేక సమస్యలను గుర్తించారు. ఇదే పరిస్థితి కొనసాగితే ముున్ముందు చీనీతోటల మనుగడకు విఘాతం కలిగే పరిస్థితి ఉందని చెబుతున్నారు. వారి అధ్యయనంలో షాకింగ్ విషయాలు వెలుగుచూశాయి.

కలుపు మందుతో సమస్య..

చీనీలో కలుపు నివారణకు ఇటీవల కాలంలో రైతులు ఎక్కువగా నిషేధిత గ్లైపోసెట్ (గ్లైసిల్)తో పాటు మరి కొన్ని ప్రమాదకర గడ్డి మందులు వాడుతుండటం



గార్లదిన్నె సమీపంలో చీనీ రైతులతో మాట్లాడుతున్న ఉద్యానశాఖ జేడీ దేవమునిరెడ్డి, శాస్త్రవేత్త డాక్టర్ శ్రీనివాసరెడ్డి

వల్ల తోటల జీవితకాలం తగ్గిపోతున్నట్లు గుర్తించారు. ట్రాక్టర్ లేదా కూలీల ద్వారా కలుపు నివారణ చర్యలు చేపడితే భూమి గుల్లబారిపోయి పంటకు ఉపయోగపడుతుంది. ప్రమాదకరమైన గడ్డి మందు వాడటం వల్ల చెట్లు తొందరగా చనిపోతున్నాయి. లైఫ్‌టైం (జీవితకాలం) 20 సంవత్సరాల నుంచి 10 సంవత్సరాలకు పడిపోయే ప్రమాదం ఉంది. విచ్చలవిడి రసాయన ఎరువులు, మోతాదుకు మించి పురుగు మందులు వాడుతుండటం వల్ల వైరస్ వ్యాప్తి పెరుగుతోంది. దీనివల్ల ఎండుతెగులు, వేరుకుళ్లు తెగులు, పొలుసుపురుగు, నల్లి, మంగు, బంకతెగులు లాంటి చీడపీడలు పెరిగిపోతున్నాయి. కాపునకు వచ్చిన పెద్ద చెట్లు సైతం ఉన్నఫళంగా ఎండిపోతున్నాయి.

- అలాగే మొక్కల ఎంపికలో కూడా రైతులు పొరపాట్లు చేస్తున్నారు. నర్సరీల నుంచి వైరస్ ఉన్న మొక్కలను తెచ్చుకోవడం వల్ల తోటలు దెబ్బతింటున్నాయి. సూక్ష్మపోషకాల లోపం ఎక్కువగా ఉంది. రంగపూర్ రకం కాకుండా జంభేరి అంట్లు కట్టిన మొక్కలనే నిర్వాహకులు రైతులకు అంటగడుతుండటంతో చీనీ తోటల జీవితకాలం గణనీయంగా తగ్గిపోతోంది. ఎకరాకు రూ.50 వేలు ఉండాల్సిన పెట్టుబడి ఇప్పుడు రూ.లక్ష వరకు పెరిగింది. దీంతో పంటకు గిట్టుబాటు ధరలు లభించడం లేదు. దిగుబడులు కూడా ఎకరాకు 15 టన్నులు రావాల్సి ఉండగా 10 టన్నులకు పడిపోతోంది. రంగపూర్ అంటు మొక్కలతో పాటు సాగు పద్ధతుల్లో మేలైన యాజమాన్యం పాటిస్తే తప్ప రైతులకు చీనీ తోటలు గిట్టుబాటు అయ్యే పరిస్థితి లేదని అధ్యయన బృందం సభ్యులు చెబుతున్నారు.

శ్యాంపిల్స్ సేకరణ

బృందం సిఫారసు మేరకు ఎండుతెగులు, వేరుకుళ్లు తెగులు లాంటి ప్రధాన చీడపీడల వ్యాప్తికి స్పష్టమైన కారణాలు తెలుసుకునే నిమిత్తం చీనీ తోటల నుంచి శ్యాంపిల్స్ సేకరించి తిరుపతి పరిశోధన కేంద్రానికి పంపుతున్నట్లు జిల్లా అధికారి ఉమాదేవి తెలిపారు. అలాగే నర్సరీ నుంచి తెచ్చిన మొక్కల్లోనే వైరస్ ఉందా లేదా తెలుసుకునేందుకు 'వైరల్ ఇండెక్సియన్' కింద తల్లి మొక్కతో పాటు చిన్న మొక్కల శ్యాంపిల్స్ సేకరించామన్నారు. అలాగే జిల్లాలో ఉన్న చీనీ రైతుల వివరాల సేకరించి వాట్సాప్ గ్రూప్ తయారు చేసి రైతులకు అవసరమైన సలహాలు, సాగు పద్ధతులు తెలియజేస్తామన్నారు. ఇలా పంటల వారీగా వాట్సాప్ గ్రూప్‌లు ఏర్పాటు చేస్తామన్నారు.

చీనీ సాగులో అగ్రస్థానం..

రాష్ట్రంలోనే ఎక్కడా లేని విధంగా అనంతపురం జిల్లాలో 37 వేల హెక్టార్లు, శ్రీసత్యసాయి జిల్లాలో 15 వేల హెక్టార్లు.. వెరసి 52 వేల హెక్టార్ల భారీ విస్తీర్ణంలో చీనీ తోటలు సాగులో ఉన్నాయి. ఏటా అనంతపురం జిల్లాలో 7.43 లక్షల మెట్రిక్ టన్నులు, శ్రీసత్యసాయి జిల్లాలో 3 లక్షల మెట్రిక్ టన్నులు.. మొత్తంగా 10.43 లక్షల మెట్రిక్ టన్నుల ఫలసాయంతో దేశంలోనే అత్యధికంగా ఈ ప్రాంత రైతులు చీనీ పండిస్తున్నారు. జిల్లా నుంచి 70 శాతం పంట దిగుబడులు ఢిల్లీలో ఉన్న ప్రధాన మార్కెట్ ఆజాద్‌పూర్ మండీతో పాటు గుజరాత్, మధ్యప్రదేశ్, రాజస్తాన్ లాంటి పలు ఉత్తరాది రాష్ట్రాలకు ఎగుమతి అవుతున్నాయి. ఉమ్మడి జిల్లాలో చీనీ ద్వారా ఏటా రూ.2 వేల కోట్ల వరకు టర్నోవర్ జరుగుతున్నట్లు ఉద్యాన నివేదికలు చెబుతున్నాయి.

ముంపు ప్రమాదంలో గుడ్డంపల్లి

- ఆందోళనలో గ్రామస్తులు



నిరసన వ్యక్తం చేస్తున్న గుడ్డంపల్లి వాసులు

తాడిమర్రి: మండల సరిహద్దులోని చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ (సీబీఆర్) లోకి గండికోట రిజర్వాయర్ నుంచి నీటి విడుదలను నిలుపుదల చేయకపోతే గుడ్డంపల్లి గ్రామం మునిగిపోతుందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేశారు. శుక్రవారం వారు సీబీఆర్ వరద నీటిలోకి దిగి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ.. రెండేళ్లుగా గండికోట రిజర్వాయర్ నీటిని సీబీఆర్‌లోకి పంపింగ్ చేస్తున్నారని, దీంతో గ్రామంలోకి నీరు చొచ్చుకుని వస్తోందన్నారు. గత ఏడాది గండికోట నుంచి 10 టీఎంసీలు నీటిని వదలారని గుర్తు చేశారు. ఈ ఏడాది కూడా ఇప్పటికే గ్రామ సమీపంలోకి నీరు చేరిందన్నారు. గ్రామానికి ఓ వైపు నీరు, మరోవైపు పొలాలు ఉండటంతో పశువులను మేపునకు తీసుకెళ్లడానికి కూడా ఇబ్బందిగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నీటిని పంపింగ్ చేయడం నిలుపుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో బాస్వంతరెడ్డి, బ్రహ్మానందరెడ్డి, వెంకటనారాయణరెడ్డి, నాగిరెడ్డి, వెంకటలక్ష్మమ్మ, నాగమ్మ, నారాయణమ్మ తదితరులు పాల్గొన్నారు.

తల్లిదండ్రుల చెంతకు వివాహిత

బత్తలపల్లి: భర్తతో కలిసి కాపురం చేయడం ఇష్టం లేక తన ఇద్దరు కుమార్తెలతో కలసి కనిపించకుండా పోయిన వివాహిత ఆచూకీని పోలీసులు గుర్తించి తల్లిదండ్రుల చెంతకు చేర్చారు. ఈ నెల 6న బత్తలపల్లికి చెందిన భాగ్యలక్ష్మి తన ఇద్దరు కుమార్తెలను పిలుచుకుని ఇంట్లో ఎవరికి చెప్పకుండా వెళ్లిపోయిన విషయం తెలిసిందే. భాగ్యలక్ష్మి తల్లి గోగుల అరుణ ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసిన పోలీసులు.. తిరుమలలో ఉన్నట్లుగా గుర్తించి అక్కడికెళ్లి శుక్రవారం వారిని పిలుచుకొచ్చారు. అనంతరం తల్లిదండ్రులను పీఎస్‌కు పిలిపించి కౌన్సెలింగ్ అనంతరం అప్పగించారు.

రైతులను ముంచిన సొసైటీ సీఈఓ

- మార్టిగేజ్ లోన్ క్లియర్ చేస్తానని రూ.20 లక్షలకు టోకరా



చిలమత్తూరు: రైతులు వడ్డీతో సహా చెల్లించిన రుణానికి సంబంధించిన రూ.20 లక్షలను గుట్టుచప్పుడు కాకుండా కోడూరు సొసైటీ సీఈఓ కాజేసిన ఘటన వెలుగు చూసింది. నగదు చెల్లించి మూడు నెలలు కావస్తున్నా బ్యాంకులో నగదు జమ చేయకపోవడంతో రైతులు మార్టిగేజ్ చేసిన సర్వే నెంబర్లు వెబ్ ల్యాండ్‌లో లాక్‌లోనే ఉండిపోయాయి. దీంతో అనుమానం వచ్చిన రైతులు గోరంట్లలోని సొసైటీ బ్యాంకుకు వెళ్లి ఆరా తీశారు. సీఈఓ రవీంద్రకుమార్ అలియాస్ కుమార్ రైతుల వద్ద నుంచి వసూలు చేసిన రూ.20 లక్షలకు సంబంధించిన సొసైటీ రసీదులను చూపించారు. అయితే ఆ మొత్తాన్ని సీఈఓ బ్యాంక్‌లో చెల్లించలేదని తెలుసుకుని సీఈఓ కుమార్‌ను ఫోన్ ద్వారా సంప్రదించారు. తాను సెలవులో ఉన్నానని, సోమవారం వచ్చి లాక్ తీస్తానని చెప్పి కట్ చేయడంతో ఆందోళనకు గురయ్యారు. ఇదే అంశంపై సొసైటీ బ్యాంకు ఇన్‌చార్జ్ మేనేజరు హరికృష్ణను వివరణ కోరగా.. రైతులు చెబితే కానీ తమకు ఈ విషయం తెలియలేదన్నారు. సీఈఓలే రైతుల వద్ద నగదు సేకరించి బ్యాంకుకు కడుతుంటారన్నారు. అయితే సంబంధిత రైతులకు సంబంధించి నగదు తమకు చేరలేదన్నారు. రైతులు చెల్లించిన సొమ్మును బ్యాంకుకు కట్టకపోవడం తప్పు అని, జరిగిన విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతామని పేర్కొన్నారు.

రాష్ట్రంలో ధృతరాష్ట్రుడి పాలన

- విపరీతమైన ధనదాహంతో టీడీపీ ఎమ్మెల్యేలు దోచుకుంటున్నారు
- ప్రభుత్వ మెడికల్ కళాశాలలను కాపాడుకుందాం
- వైఎస్సార్‌సీపీ హిందూపురం పార్లమెంట్ పరిశీలకులు రమేష్‌కుమార్‌రెడ్డి
- ప్రభుత్వ తీరును ఎండగడదాం : మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి (చిత్రంలో) పార్టీ పరిశీలకులు రమేష్‌కుమార్‌రెడ్డి, తాడిపత్రి రమేష్‌రెడ్డి , తదితరులు

రాప్తాడు రూరల్: చంద్రబాబు ముఖ్యమంత్రి అయిన తర్వాత రాష్ట్రంలో ధృతరాష్ట్ర పాలన సాగుతోందని వైఎస్సార్‌సీపీ హిందూపురం పార్లమెంట్ పరిశీలకులు రెడ్డిగారి రమేష్‌కుమార్ రెడ్డి మండిపడ్డారు. ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రైవేట్‌పరం చేయడాన్ని వ్యతిరేకిస్తూ వైఎస్సార్‌సీపీ అధిష్టానం పిలుపు మేరకు రాప్తాడు నియోజకవర్గంలో కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని శుక్రవారం ప్రారంభించారు. అనంతపురం రూరల్ మండలం ఆకుతోటపల్లిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, నియోజకవర్గ పరిశీలకులు తాడిపత్రి రమేష్‌రెడ్డితో కలిసి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పార్లమెంటు పరిశీలకులు రమేష్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ... ప్రజల కోసం నాడు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం తీసుకువచ్చిన మెడికల్ కళాశాలలను నేడు చంద్రబాబు ప్రైవేట్‌పరం చేస్తున్నారని మండిపడ్డారు. 30 లక్షల మంది విద్యార్థులకు తల్లికి వందనం ఎగ్గొట్టారన్నారు. మహిళలకు నెలకు రూ.1,500 ఇస్తామని చెప్పి వంచించారన్నారు. టీడీపీ ఎమ్మెల్యేలు విపరీతమైన ధనదాహంతో అక్రమ వసూళ్లు, అరాచకాలకు తెరలేపారన్నారు. కూటమి ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలపై తీవ్ర వివక్ష చూపిస్తోందన్నారు.

ప్రతి ఒక్కరూ సంతకాలు చేయాలి..

తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి మాట్లాడుతూ... ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ ప్రతి ఒక్కరూ సంతకాలు చేయాలని పిలుపునిచ్చారు. సూపర్ సిక్స్‌తో పాటు 200 హామీలు ఇచ్చిన చంద్రబాబు కేవలం 2–3 పథకాలు పాక్షికంగా అమలు చేశారన్నారు. కళ్లు ఆర్పకుండా అబద్ధాలు చెప్పడంలో చంద్రబాబు తనకు తానే సాటి అని మరోసారి నిరూపించుకున్నారన్నారు. జగనన్న ముఖ్యమంత్రి కాక ముందు కేవలం 11 ప్రభుత్వ మెడికల్ కళాశాలలుండేవన్నారు. ఆయన వచ్చిన తర్వాత 17 కొత్త కళాశాలలను తీసుకొచ్చారన్నారు. ఈ క్రమంలో ఏటా 5 వేలమంది పేద విద్యార్థులు ఉచితంగా వైద్యవిద్య చదువుకునే అవకాశాన్ని కల్పించారన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత కొత్త మెడికల్ కళాశాలల నిర్మాణాలను ఆపేసిందన్నారు. ఇప్పుడు ప్రైవేట్‌పరం చేసేందుకు పూనుకుందని, ప్రభుత్వ చర్యలను వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. దోచుకోవడంలో రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత రాష్ట్రంలోనే ఆల్‌టైం రికార్డ్ సాధిస్తోందన్నారు. ఒక్క పాపంపేటలోనే రూ.వేల కోట్ల విలువైన 500 ఎకరాలకు పైగా శ్రోత్రియం భూములను తన బంధువుల పేరుపై అక్రమంగా జీపీఏ చేయించుకున్నారన్నారు. హంద్రీ-నీవా కాలువకు లైనింగ్ వేయడం వల్ల నియోజకవర్గంలో భూగర్భజలాలు అడుగంటి 2 లక్షల ఎకరాలకు నీరు అందకుండా పోతోందన్నారు. పరిటాల సునీత ఇచ్చిన లేఖ వల్ల 50 వేల పేదల గృహ నిర్మాణాలు ఆగిపోయాయన్నారు.కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ గురుప్రసాద్, రాప్తాడు ఎంపీపీ వరలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు చంద్రకుమార్, పార్టీ మండల కన్వీనర్లు గోవిందరెడ్డి, పవన్, ఎంపీటీసీ సభ్యులు సునీల్‌దత్త రెడ్డి, సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

బాలికల సంరక్షణతోనే మానవ మనుగడ

- ఐసీడీఎస్ పీడీ ప్రమీల

పుట్టపర్తి అర్బన్: బాలికల సంరక్షణతోనే మానవ మనుగడ సాధ్యమని ఐసీడీఎస్ పీడీ ప్రమీల, జిల్లా ఆరోగ్య శాఖ ప్రోగ్రాం ఆఫీసర్ వీరమ్మ పేర్కొన్నారు. శుక్రవారం పుట్టపర్తి ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ ఏవీ రమణారెడ్డి, సీడీపీఓ జయంతి, సూపర్‌వైజర్ సుజాత, సింగిల్‌విండో మాజీ అధ్యక్షుడు శ్రీరాంరెడ్డి ఆధ్వర్యంలో అంతర్జాతీయ బాలికా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. సమాజంలో బాలికలకు ప్రత్యేక స్థానం ఉందని వారిని మంచిగా చూసుకోవాలని, ఆడ, మగ తేడా లేకుండా పెంచి పోషించాలన్నారు. ఆడపిల్లల నిష్పత్తి మరింత పెరగాలన్నారు. బాల్య వివాహాలు జరగకుండా ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా కిశోర వికాసం పై నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థినులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎంఈఓ ప్రసాద్, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ రమణారెడ్డి, ఏపీఎం లక్ష్మీనారాయణ, హెచ్‌ఎం వెంకటరమణ, అంగన్‌వాడీ కార్యకర్తలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

31 మండలాల్లో వర్షం



ధర్మవరం చెరువు మరువ వద్ద సందడి చేస్తున్న పట్టణ ప్రజలు

పుట్టపర్తి అర్బన్: తుపాను ప్రభావంతో జిల్లా వ్యాప్తంగా గురువారం రాత్రి నుంచి శుక్రవారం ఉదయం వరకూ 409.6 మి.మీ వర్షపాతం నమోదైంది. అత్యధికంగా పుట్టపర్తి మండలంలో 38.4 మి.మీ, నల్లమాడ మండలంలో 36 మి.మీ వర్షపాతం నమోదైంది. పెనుకొండ మండలంలో 27.8 మి.మీ, గాండ్లపెంట 25.6, అగళి 23.4, ఓడీచెరువు 22.6, సోమందేపల్లి 21.2, రొళ్ల 20.4, గోరంట్ల 18.4, అమడగూరు 17.8, తలుపుల 16.8, తనకల్లు 15.4, కొత్తచెరువు 14.6, హిందూపురం 13.4, బుక్కపట్నం 13.0, తాడిమర్రి 10.8, పరిగి 10.6, నల్లచెరువు 10.2, కదిరి 9.2, మడకశిర 9.2, గుడిబండ 6.2, ధర్మవరం 5.6, సీకేపల్లి 4.4, రొద్దం 3.4, ఎన్పీ కుంట 3.0, ముదిగుబ్బ 2.8, బత్తలపల్లి 2.4, రామగిరి 2.4, కనగానపల్లి 2.2, అమరాపురం 1.2, లేపాక్షి మండలంలో 1.2 మి.మీ మేర వర్షపాతం నమోదైనట్లు వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. జిల్లాకు మరో రెండు రోజులు వర్ష సూచన ఉన్నట్లు వారు వెల్లడించారు.

వాగులు, వంకలకు జలకళ : తాజా వర్షాలతో వాగులు, వంకలు జలకళను సంతరించుకున్నాయి. పుట్టపర్తి సమీపంలోని ఎనుములపల్లి చెరువు మరువ పారి నీరు పంట పొలాలపై వెళ్తుండటంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు.

మరువ పారుతున్న ధర్మవరం చెరువు

ధర్మవరం అర్బన్: గురువారం అర్ధరాత్రి కురిసిన భారీ వర్షానికి ధర్మవరం చెరువు మరువ పారుతోంది. శుక్రవారం ఉదయం నుంచి చెరువు మొదటి మరువ పారుతుండటంతో పట్టణ ప్రజలు అక్కడకు వెళ్లి సరదాగా గడుపుతున్నారు. మహిళలు మరువ నీటిలో స్నానం చేస్తూ సంతోషంగా గడిపారు.

చిత్తశుద్ధితో కష్టపడితే విజయం సాధ్యం

- కలెక్టర్ శ్యాంప్రసాద్



జాబ్‌మేళాలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్యాంప్రసాద్

హిందూపురం టౌన్: చిత్తశుద్ధితో కష్టపడితే విజయం తప్పకుండా వరిస్తుందని కలెక్టర్ శ్యాం ప్రసాద్ అన్నారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో హిందూపురంలోని ఎస్‌డీజీఎస్ కళాశాలలో శుక్రవారం ఏర్పాటు చేసిన మెగా జాబ్‌మేళాను కలెక్టర్ ప్రారంభించి, మాట్లాడారు. జిల్లాలో రాబోవు రోజుల్లో మరిన్ని భారీ పరిశ్రమలు రానున్నాయన్నారు. వాటికి అనుగుణంగా చదువుతో పాటు నైపుణ్యాలనూ పెంపొందించుకోవాలన్నారు. జిల్లాలోని అన్ని నియోజకవర్గాలలో స్కిల్ హబ్‌సెంటర్లు ఉన్నాయని, వాటి ద్వారా నైపుణ్యాలను పెంపొందించుకోవాలని యువతకు సూచించారు. ఉద్యోగం చిన్నదా, పెద్దదా అనే ఆలోచన కంటే ముందు జీవితంలో స్థిరపడాలనే లక్ష్యంతో ముందుకు సాగాలన్నారు. కొంతకాలం కష్టపడితే మంచి భవిష్యత్ ఉంటుందన్నారు. అనంతరం వివిధ ప్రాంతాలకు చెందిన 15 బహుళ జాతి కంపెనీల ప్రతినిధులు హాజరై, ఆయా కంపెనీలకు అవసరమైన మానవ వనరులను ఎంపిక చేశారు. కార్యక్రమంలో జిల్లా పరిశ్రమల అధికారి నాగరాజు, జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి హరికృష్ణ, మున్సిపల్ చైర్మన్ డీఈ రమేష్, కళాశాల కరస్పాండెంట్ బైసాని రాంప్రసాద్, ప్రిన్సిపాల్ నాగేంద్రకుమార్, మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున, తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రిలో పారిశుధ్యాన్ని మెరుగుపరచండి..

ప్రభుత్వాస్పత్రిలో పారిశుధ్యాన్ని మెరుగు పరచాలని సంబంధిత అధికారులను కలెక్టర్ శ్యాంప్రసాద్ ఆదేశించారు. శుక్రవారం హిందూపురం వచ్చిన కలెక్టర్.. జిల్లా ప్రభుత్వాస్పత్రిని ఆకస్మిక తనిఖీ చేశారు. సదరం క్యాంపును, ఆస్పత్రిలోని వివిధ విభాగాలను పరిశీలించారు. రోగులతో మాట్లాడుతూ.. అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. సదరం క్యాంప్‌ను పారదర్శకంగా నిర్వహించాలని సిబ్బందికి సూచించారు. రోగులతో ఆప్యాయంగా మాట్లాడుతూ మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు. వార్డుల్లో వర్షపు నీరు నిలిచి అపరిశుభ్రంగా ఉండడంతో అసహనం వ్యక్తం చేశారు. వార్డులు, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. కార్యక్రమంలో డీసీహెచ్‌ఎస్ డాక్టర్ మధుసూదన్, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అన్నపూర్ణ, ఆర్‌ఎంఓ డాక్టర్ లక్ష్మీరామ్‌నాయక్, పాల్గొన్నారు.

పట్టుగూళ్ల విక్రయ కేంద్రం తనిఖీ

హిందూపురం: పట్టుసాగులో జిల్లాను ప్రథమ స్థానంలో నిలపాలని, ఇందుకు అవసరమైన సహకారం అందిస్తామని కలెక్టర్ శ్యాం ప్రసాద్ పేర్కొన్నారు. శుక్రవారం హిందూపురంలోని పట్టుగూళ్ల విక్రయ కేంద్రాన్ని కలెక్టర్ సందర్శించారు. పట్టుగూళ్ల ఈ-వేలం పద్ధతి, ఈ-మార్కెటింగ్ ప్రక్రియలను పరిశీలించారు. పట్టు రైతులతో మల్బరీ సాగు, పట్టుగూళ్ల ఉత్పత్తి విక్రయాలపై ఆరా తీశారు. అలాగే పట్టు రైతులు, రీలర్లతో మాట్లాడుతూ వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా పట్టురైతులు, రీలర్లకు ప్రభుత్వం అందిస్తున్న రాయితీ మంజూరు కాలేదని, వాటిని మంజూరు చేయించాలని కలెక్టర్‌ను పలువురు అభ్యర్థించారు. కార్యక్రమంలో పట్టు శాఖ జిల్లా సంయుక్త సంచాలకులు శోభారాణి, హిందూపురం సహాయ సంచాలకులు రత్నం, పట్టుగూళ్ల కేంద్ర అధికారి హంపయ్య, రైతులు పాల్గొన్నారు.

పెళ్లి పెటాకులు చేసిన ఫోన్‌కాల్

- ఆగిన పెళ్లి.. యువకుడిపై కేసు నమోదు

రాప్తాడు రూరల్: నేడు, రేపు (శనివారం, ఆదివారం) పెళ్లి. ఇరు కుటుంబాల్లోనూ ఏర్పాట్లన్నీ సిద్ధమయ్యాయి. ఇంతలో వరుడికి అందిన ఫోన్‌కాల్‌తో పెళ్లి కాస్త పెటాకులైంది. పోలీసులు తెలిపిన మేరకు... అనంతపురం రూరల్ మండలం మన్నీల గ్రామంలో ఓ యువతికి, మరో ప్రాంతానికి చెందిన యువకుడికి పెద్దల సమక్షంలో వివాహం నిశ్చయమైంది. శనివారం ముహూర్తం, ఆదివారం తలంబ్రాలకు నిర్ణయించుకుని రెండు కుటుంబాల్లోనూ అన్ని ఏర్పాట్లు సిద్ధం చేసుకున్నారు. ఇంతలో మన్నీల గ్రామానికి చెందిన వివాహితుడైన బాలచంద్ర.. వరుడి ఫోన్ నంబరు సేకరించుకుని శుక్రవారం కాల్ చేశాడు. 'నువ్వు పెళ్లి చేసుకునే అమ్మాయితో నాకు వ్యక్తిగత పరిచయం ఉంది. అలాంటి అమ్మాయిని ఎలా పెళ్లి చేసుకుంటావు. నీ ఇష్టం. కావాలంటే మేమిద్దం కలిసి ఉన్న ఫొటో కూడా పంపుతాను చూడు' అంటూ ఇద్దరూ కలిసి తీసుకున్న ఫొటో పంపాడు. దీంతో పెళ్లికొడుకుతో పాటు వారి కుటుంబ సభ్యులు కంగుతిని పెళ్లి రద్దు చేసుకుని వెళ్లిపోయారు. దీంతో వధువు తరపు కుటుంబసభ్యులు, బంధువులు లబోదిబోమంటూ ఇటుకలపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. తమ కూతురి పెళ్లి చెడిపోవడానికి కారణమైన బాలచంద్ర కుటుంబ సభ్యులపై దాడి చేశారు.

అంగన్‌వాడీ ఆయా ఆత్మహత్య

సోమందేపల్లి: మండలంలోని చల్లాపల్లి గ్రామ అంగన్‌వాడీ కేంద్రంలో ఆయాగా పని చేస్తున్న పూజారి శిల్ప (32) ఆత్మహత్య చేసుకుంది. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె బెంగళూరులోని ఆస్పత్రిలో చికిత్స పొంది గురువారం రాత్రికి స్వగ్రామానికి చేరుకుంది. శుక్రవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో బాత్‌రూంలో పైకప్పునకు చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. అనారోగ్యంతో ఆమె ఆత్మహత్య చేసుకున్నట్లుగా భర్త సురేష్ చేసిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.